సాక్షి కామారెడ్డి

బుధవారం । 4 । అక్టోబర్ । 2023



సీఎం హామీలను నమ్మకండి

కేసీఆర్ త్వరలో ఆపద్ధర్మ ముఖ్యమంత్రి అవుతారని, ఆయన హామీలను నమ్మవద్దని మాజీ మంత్రి షబ్బీర్ అలీ కోరారు.

- 8లో ▸



అభివృద్ధిలో దూసుకెళ్తున్నాం

తెలంగాణ ప్రాంతం అభివృద్ధిలో దూసుకెళ్తోందని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే పేర్కొన్నారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
34.4 /22.8

వాతావరణం

ఉదయం చలిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

మోదీ సభ సైడ్‌లైట్స్

- ప్రధాని మోదీ మధ్యాహ్నం 3.51 గంటలకు కలెక్టరేట్‌లోని హెలీప్యాడ్‌కు చేరుకున్నారు.
- వాయుసేనకు చెందిన మూడు హెలీకాప్టర్లు వచ్చాయి.
- ఎంపీ అర్వింద్ ప్రసంగిస్తుండగా హెలీకాప్టర్లు రావడంతో ప్రజలు మోదీ.. మోదీ.. అంటూ నినాదాలు చేశారు.
- పలు అభివృద్ధి పనులను అధికారిక వేదిక మీదుగా పీఎం వర్చువల్‌గా ప్రారంభించారు.
- మోదీ సభా ప్రాంగణానికి ఓపెన్ టాప్ జీపులో ప్రజలకు అభివాదం చేస్తూ రాగా.. ప్రజలు పూలవర్షం కురిపించారు.
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఎంపీ అర్వింద్ ప్రధాన మంత్రిని పసుపు కొమ్ముల మాలతో సన్మానించారు.
- 4.58 గంటలకు ప్రసంగాన్ని ప్రారంభించిన మోదీ.. 42 నిమిషాలపాటు మాట్లాడారు.
- ప్రధాని తన ప్రసంగంలో ఆరుసార్లు 'నా కుటుంబ సభ్యులారా' అంటూ సంబోధించారు.
- ప్రధాని వేదికపై ఉన్న రాష్ట్ర ప్రధానకార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి, ఈటల రాజేందర్‌తోపాటు అర్వింద్, డీకే అరుణతో ముచ్చటించారు.
- ప్రసంగం అనంతరం మోదీ 5.41 గంటలకు వేదిక దిగి వెళ్లిపోయారు.
- బీజేపీ కామారెడ్డి జిల్లా అధ్యక్షురాలు అరుణతార వందన సమర్పణ చేశారు.
- నాగేశ్వర్‌రావు కళాకారుల బృందం ఆటపాటలతో సభికులను అలరించింది.
- 'ఇందూరు గడ్డపై బీజేపీ జెండా' పాటకు ప్రజల నుంచి భారీ స్పందన వచ్చింది.
- ప్రధానిని దగ్గరగా చూసేందుకు ప్రజలు వారికి కేటాయించిన గ్యాలరీలను తోసుకుంటూ మీడియా, వీఐపీ గ్యాలరీలోకి ప్రవేశించారు. విధుల్లో ఉన్న పోలీసులు వారిని నిలువరించే ప్రయత్నం చేసినా.. సాధ్యంకాలేదు.
- సభావేదికపైకి బండి సంజయ్, ఈటల రాజేందర్, అర్వింద్‌లను పిలిచిన సమయంలో ప్రజలు పెద్దఎత్తున ఈలలు, కేరింతలు, చప్పట్లు కొట్టారు.

– సుభాష్‌నగర్/నిజామాబాద్ సిటీ

ప్రధానికి ఘన స్వాగతం



నిజామాబాద్‌అర్బన్: ప్రత్యేక హెలీకాప్టర్ ద్వారా మంగళవారం మధ్యాహ్నం 3.55 గంటలకు ప్రధాని మోదీ జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. ఆయనకు గవర్నర్ తమిళిసై, రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి స్వాగతం పలికారు. వారు మోదీకి పుష్పగుచ్ఛాలు అందజేశారు. మోదీకి స్వాగతం పలికినవారిలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఎంపీ అర్వింద్, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, సీపీ సత్యనారాయణ, ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

నిరాజనం : వేదిక వద్దకు వస్తున్న ప్రధాని మోదీకి ఘన స్వాగతం పలుకుతున్న ప్రజలు



మోదీ.. మోదీ..



ఇందూరు కాషాయ వర్ణశోభితమైంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాతోపాటు నిర్మల్, జగిత్యాల జిల్లాల నుంచి తరలివచ్చిన పార్టీ శ్రేణులు, రైతులతో నగరం జనసంద్రంలా కనిపించింది. నమో నామ జపంతో సభా ప్రాంగణం దద్దరిల్లింది. ప్రధాని మోదీ ఇందూరు పర్యటన విజయవంతం కావడంతో బీజేపీ శ్రేణుల్లో నూతనోత్సాహం ఉరకలెత్తుతోంది.

బీజేపీలో నయా జోష్

- స్వచ్ఛందంగా తరలివచ్చిన రైతులు, మహిళలు
- నమో నామ జపంతో ఉర్రూతలూగిన సభాప్రాంగణం
- కేసీఆర్ కుటుంబంపై మోదీ విమర్శలకు విశేష స్పందన
- ప్రధాని ఇందూరు పర్యటన విజయవంతం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మంగళవారం నిజామాబాద్ నగరంలోని ప్రభుత్వ గిరిరాజ్ కళాశాల మైదానంలో బీజేపీ నిర్వహించిన బహిరంగ సభ.. ఆ పార్టీకి నయా జోష్ తెచ్చింది. అంచనాలకు మించి జనం తరలిరావడంతో పార్టీ నాయకులు, కార్యకర్తల ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. ఉత్తర తెలంగాణ ప్రజల చిరకాల కోరిక అయిన పసుపు బోర్డును ప్రకటిస్తూ మోదీ ఇందూరుకు రావడంతో సభకు రైతులు భారీగా తరలివచ్చారు. బహిరంగ సభ ప్రారంభం కాగానే రైతులు ప్రధానిని కలిసి ధన్యవాదాలు తెలిపారు. పసుపు కొమ్ములతో చేసిన దండను ప్రధానికి వేశారు. ప్రధానమంత్రి సభాప్రాంగణంలోకి అడుగు పెట్టిన క్షణం నుంచి జనం మోదీ మోదీ అంటూ హోరెత్తించారు. సాయంత్రం 4.59 గంటలకు ప్రసంగం ప్రారంభించిన మోదీ.. 5.40 గంటల వరకు మాట్లాడారు. ప్రధాని మాట్లాడినంత సేపు ప్రజలు ఈలలు, కేకలతో సభా ప్రాంగణాన్ని హోరెత్తించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి కేసీఆర్ గురించి మోదీ విమర్శలు చేస్తున్న సమయంలో సభికుల నుంచి విశేష స్పందన లభించింది. ఇంతకాలం పసుపు బోర్డు అంశంపై బీజేపీ, బీఆర్ఎస్ నేతల మధ్య మాటల యుద్ధం నడుస్తూ వచ్చింది. పలుసార్లు ఘర్షణలు సైతం చోటుచేసుకున్నాయి. ఈ పరిస్థితుల్లో ఊహించని రీతిలో కేంద్ర ప్రభుత్వం పసుపు బోర్డు ప్రకటించడం, ప్రధాని మోదీ జిల్లాకు రావడంతో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఉత్తర తెలంగాణపై గురి పెట్టిన బీజేపీ అందుకు ఇందూరు సభను వేదికగా చేసుకుని పోరు మొదలుపెట్టడం గమనార్హం.

మోదీ వచ్చాకే విద్యుత్ సమస్యకు పరిష్కారం

నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయ్యాకే విద్యుత్ సమస్యకు పరిష్కారం లభించిందని కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. 2014కు ముందు భారతదేశంలో విద్యుత్ కోతలు, పరిశ్రమలకు పవర్ హాలిడేస్ ఉండేవన్నారు. మోదీ ప్రధాని అయ్యాక ఎక్కడా విద్యుత్ కొరత లేదన్నారు. ఎన్టీపీసీ ఆధ్వర్యంలో చేపట్టిన 800 మెగావాట్ల సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టును తెలంగాణ ప్రజలు, రైతులు, పారిశ్రామిక రంగానికి ప్రధాని అంకితం చేశారన్నారు. మోదీ భారత్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి దిశలో తీసుకెళ్తున్నారన్నారు. ఆయుష్మాన్ భారత్, నేషనల్ హెల్త్ మిషన్ కింద ఆరోగ్య రంగంలో విశేష సేవలు అందిస్తున్నారన్నారు. అనేక సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న పసుపుబోర్డును సాకారం చేసి రైతుల సంక్షేమం కోసం అనేక చర్యలు తీసుకుంటున్నారన్నారు.





ఎన్టీపీసీ పవర్ ప్రాజెక్టును వర్చువల్‌గా ప్రారంభిస్తున్న ప్రధాని మోదీ, పక్కన గవర్నర్, కేంద్ర మంత్రి

కేసీఆర్‌ను మించిన అబద్ధాలకోరు లేరు

- నిజామాబాద్ సభలో ఈటల రాజేందర్
- సీఎంకు ముందుంది ముసళ్ల పండుగన్న ఎంపీ అర్వింద్



ఈటల రాజేందర్



ధర్మపురి అర్వింద్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: సీఎం కేసీఆర్‌ను మించిన అబద్ధాల కోరు తెలంగాణలో మరొకరు లేరని బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. మాట ఇచ్చి నిలబెట్టుకునే వ్యక్తి, అమలుకు మారు పేరు మోదీ అన్నారు. పసు పు బోర్డు హామీ నెరవేర్చడం దీనికి నిదర్శనమన్నా రు. పసుపు బోర్డు ఇస్తే అభ్యర్థిని పెట్టబోమని చెప్పి న బీఆర్ఎస్.. ఇప్పుడు ఏం ముఖం పెట్టుకుని ఎన్ని కల్లో పోటీ చేస్తుందో చెప్పాలన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక సొంతింటి కల నెరవేర్చే బాధ్యత తీసుకుంటుందన్నారు. హైదరాబాద్ శివార్లలో భూ ములు అమ్మేసి, మద్యం టెండర్లు ముందుగానే పెట్టి రూ.13వేల కోట్లు సేకరించినప్పటికీ పంట రుణాల మాఫీ చేయలేదన్నారు. జీతాలు, పింఛన్లు ఇవ్వలేని స్థితిలో కేసీఆర్ ప్రభుత్వం ఉందన్నారు. హుజురాబాద్‌లో అందరూ దళితబంధు పథకాన్ని తీసుకుని తనను గెలిపించుకున్నారన్నారు. ఇప్పు డు కూడా బీఆర్ఎస్ డబ్బులు ఇస్తే తీసుకోవాలని, ఓటు మాత్రం బీజేపీకి వేయాలన్నారు.

జిల్లాకు జాతీయ పసుపు బోర్డు మంజూరు చేసిన ప్రధాని మోదీకి పాదాభి వందనమని ఎంపీ ధర్మపురి అర్వింద్ పేర్కొ న్నారు. పింకీ కుక్కలు పసుపు బోర్డు రాద ని ప్రచారం చేశారన్నారు. పసుపు బోర్డుతో తన లక్ష్యం నెరవేరలేదని, తన అసలు లక్ష్యం ఇప్పుడే ప్రారంభమైందని పేర్కొన్నారు. కల్వకుంట్ల కుటుంబానికి ముందుంది ముసళ్ల పండుగేనన్నారు. మంత్రి కేటీఆర్ ప్రధాని మోదీ గురించి ట్విట్టర్‌లో అవాకులు చెవాకులు పేలుతున్నాడన్నా రు. కేటీఆర్ నీ బతుకెంత.. నీ లెక్కెంత అంటూ ధ్వజమెత్తారు. డ్రగ్స్ తీసుకునే కేటీఆర్ మత్తుకు బానిసయ్యాడని ఆరోపించారు. వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల కోసం కేంద్రం జక్రాన్‌పల్లికి ఎయిర్‌పోర్టు మంజూరు చేస్తే స్థలం ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. గల్ఫ్ సోదరుల గోస తీర్చే రోజులు త్వరలోనే రానున్నాయని, అది బీజేపీతోనే సాధ్యమని పేర్కొన్నారు. బీడీ కార్మికులకు ప్రత్యామ్నాయంపై ప్రధాని ప్రత్యేక దృష్టి సారించారన్నారు. నిజాం షుగర్స్ ఫ్యాక్టరీ తెరిచి మళ్లీ ఈ ప్రాంతం చెరుకుతో కళకళలాడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు.



సభకు వచ్చిన జనం

న్యూస్‌రీల్

సౌత్‌జోన్ హాకీ పోటీలకు జిల్లా క్రీడాకారిణి ఎంపిక



కామారెడ్డి అర్బన్: తెలంగాణ హాకీ సబ్ జూనియర్ మహిళా రాష్ట్ర జట్టుకు జిల్లా క్రీడాకారిణి టి.శ్రావ్య ఎంపికైంది. హాకీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నీలం లింగం, రాంరెడ్డి, కోశాధికారి మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఈనెల 17 నుంచి 24 వరకు తమిళనాడు రాజధాని చైన్నైలో నిర్వహించే సౌత్‌జోన్ హాకీ చాంపియన్‌షిప్‌లో శ్రావ్య రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుందని పేర్కొన్నారు. ఆమెను జిల్లా హాకీ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు.

జుక్కల్ బీఎస్పీ అభ్యర్థిగా ప్రజ్ఞ కుమార్!



సాక్షి, కామారెడ్డి: జుక్కల్ నియోజకవర్గం నుంచి బీఎస్పీ అభ్యర్థిగా మద్నూర్ మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీపీ ప్రజ్ఞ కుమార్ పేరును మంగళవారం ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం ప్రకటించింది. ఆయన గతంలో టీడీపీ నుంచి ఎంపీపీగా ఎన్నికయ్యారు. ఎమ్మెల్యే హన్మంత్‌సింధేకు అనుచరుడిగా ఉండేవారు. తర్వాతి కాలంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆయన రెండేళ్లుగా ఆ పార్టీకి దూరంగా ఉంటున్నారు. ఇటీవల బీఎస్పీలో చేరారు. రాష్ట్రంలో బీఎస్పీ ప్రకటించిన తొలి జాబితాలో ఉమ్మడి జిల్లాలో జుక్కల్ అభ్యర్థిగా ప్రజ్ఞకుమార్ పేరుంది.

నేడు మంత్రి కేటీఆర్ రాక

- బాన్సువాడలో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్న మంత్రి
- భారీ జన సమీకరణకు బీఆర్ఎస్ నేతల సన్నాహాలు
- ఏర్పాట్లను పరిశీలించిన స్పీకర్ పోచారం

సాక్షి, కామారెడ్డి/బాన్సువాడ: మున్సిపల్, ఐటీ శాఖల మంత్రి కేటీఆర్ బుధవారం జిల్లాలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు నిర్మల్ జిల్లా కేంద్రం నుంచి హెలీకాప్టర్‌లో బయలుదేరి బాన్సువాడ పట్టణంలోని వీక్లీ మార్కెట్ వెనకాల ఏర్పాటు చేసిన హెలీపాడ్‌కు చేరుకుంటారు. బల్దియా పరిధిలో రూ.85 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల్లో పాల్గొంటారు. ముందుగా అంబేడ్కర్ భవనాన్ని ప్రారంభిస్తారు. తర్వాత మల్టీ జనరేషన్, చిల్డ్రన్ పార్క్‌లు, ట్రాఫిక్ సిగ్నల్ ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. ఏరియా ఆస్పత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. మున్సిపల్ కార్యాలయ భవనం, రెవెన్యూ సమీకృత భవనాలను ఆయన ప్రారంభిస్తారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు వీక్లీ మార్కెట్ గ్రౌండ్‌లో జరిగే బహిరంగ సభలో కేటీఆర్ పాల్గొంటారు. 5.30 గంటలకు తిరిగి హెలీకాప్టర్ ద్వారా హైదరాబాద్‌కు బయలుదేరి వెళతారు.



సభాస్థలాన్ని పరిశీలిస్తున్న స్పీకర్ పోచారం, డీసీసీబీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి

సభ విజయవంతంపై దృష్టి..

మంత్రి కేటీఆర్ పాల్గొనే సభను విజయవంతం చేయడంపై బీఆర్ఎస్ నాయకులు దృష్టి సారించారు. భారీ జన సమీకరణకు సన్నాహాలు చేసుకున్నారు. ప్రతి గ్రామం నుంచి పెద్ద ఎత్తున జన సమీకరణ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. కేటీఆర్ సభ ఏర్పాట్లను స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఏర్పాట్లపై డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డికి పలు సూచనలు ఇచ్చారు. మున్సిపల్ శాఖ ద్వారా విడుదలైన రూ.65 కోట్ల అభివృద్ధి పనులు, ఎస్‌డీఎఫ్ ద్వారా మంజూరైన రూ.20 కోట్ల పనులను కేటీఆర్ ప్రారంభిస్తారని స్పీకర్ తెలిపారు.

పార్కింగ్ స్థలాలు..

- సభకు వచ్చే వాహనాలను నిలిపేందుకు పార్కింగ్ స్థలాలను అధికారులు గుర్తించారు.
- బీర్కూర్, నస్రూల్లాబాద్, వర్ని, రుద్రూర్, చందూర్, కోటగిరి, పొతంగల్ మండలాల నుంచి వచ్చే వారి వాహనాలను బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల, కోన బాన్సువాడ ఉన్నత పాఠశాల, రేణుక వొకేషనల్ కళాశాల వెనకాల నున్న వెంచర్‌లో పార్కింగ్ చేయాలని సూచించారు.
- హన్మాజీపేట్, కోనాపూర్, కొత్తాబాది, తిర్మలాపూర్, జేకే తండా, బోర్లం, మొగులాన్‌పల్లి, కొయ్యగుట్ట వైపునుంచి వచ్చే వాహనాలను ఈద్గాతోపాటు వ్యవసాయ మార్కెట్ కమిటీలో పార్కింగ్ చేయాలని తెలిపారు.
- బుడ్మి, తాడ్కోల్ గ్రామాల వైపు నుంచి వచ్చే వారి వాహనాలను హెచ్‌పీ పెట్రోల్ బంక్, ఎస్ఎస్ ఫ్యాషన్ మాల్ వద్ద పార్కింగ్ చేసేలా పోలీసులు ఏర్పాట్లు చేశారు.

'నెలాఖరులోగా పత్తి కొనుగోలు కేంద్రాలు'

కామారెడ్డి క్రైం: జిల్లాలో ఈనెలాఖరులోగా పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 29,097 ఎకరాలలో పత్తి సాగయ్యిందని, 20,368 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారని పేర్కొన్నారు. మద్నూర్ మార్కెట్ కమిటీ పరిధిలో 7 జిన్నింగ్ మిల్లుల ద్వారా పత్తి కొనుగోలు చేస్తామని తెలిపారు. ప్రభుత్వం క్వింటాలు పత్తికి రూ.7,020 ధర నిర్ణయించిందని, సీసీఐ ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు తమ పంటను విక్రయించి లబ్ధి పొందాలని సూచించారు.

'ఎన్నికలకు సన్నద్ధం కావాలి'

కామారెడ్డి క్రైం: శాసనసభ ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సన్నద్ధం కావాలని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ సూచించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మంగళవారం అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన వెంటనే ప్రవర్తనా నియమావళి అమలులోకి వస్తుందన్నారు. ఆనాటి నుండే అభ్యర్థుల వ్యయ నియంత్రణను మానిటరింగ్ చేయడానికి కమిటీ సమాయత్తం కావాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అమలు పరిచే ఫ్లయింగ్ స్క్వాడ్, సర్వైవల్ స్టాటిస్టికల్, వీడియో సర్వైవల్, వీడియో వ్యూవింగ్ బృందాలకు సంబంధించిన సహాయ వ్యయ పరిశీలకులను నియమించడానికి ఏర్పాటు చేసిన కమిటీలకు ఆమోదం తెలిపారు. అధికారులు సరైన శిక్షణ పొంది ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించడానికి కృషి చేయాలన్నారు. ఎన్నికల నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ నరసింహారెడ్డి, సీపీవో రాజారాం, జిల్లా అడిట్ అధికారి కిషన్, డీపీవో శ్రీనివాస్, కలెక్టరేట్ ఏవో మసూర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రమోహన్


హనుమంతుని వేషధారణలో అభిమాని



గిరిరాజ్ కాలేజీ మైదానానికి తరలివస్తున్న ప్రజలు, బీజేపీ శ్రేణులు


సభకు వచ్చిన తల్లితో చిన్నారి

మోదీ సభకు పోటెత్తిన జనం

- భారీగా తరలివచ్చిన పసుపు రైతులు
- కిక్కిరిసిన సభా ప్రాంగణం
- రోడ్డుపై నుంచే వీక్షించిన ప్రజలు




సభాప్రాంగణానికి నడిచివస్తున్న జనాలు

నిజామాబాద్ అర్బన్: నగరంలో జీజీ కళాశాల మైదానంలో మంగళవారం నిర్వహించిన ప్రధాని నరేంద్ర మోదీ ఇందూరు జనగర్జన సభకు జనం పోటెత్తారు. సభకు ఉదయం నుంచి ప్రజల సందడి మొదలైంది. బీజేపీ నాయకుల అంచనా మేరకు ప్రజలు తమ ప్రియతమ నాయకుడిని చూసేందుకు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో సభాప్రాంగణంతో పాటు చుట్టు పక్కల ప్రాంతాలు జనంతో కిక్కిరిసిపోయాయి. దీంతో కంఠేశ్వర్, బైపాస్ ప్రాంతాలు జనసంద్రంగా మారాయి. ప్రధాన గేట్ల ద్వారా ప్రజలను తనిఖీ చేసి సభలోకి అనుమతించారు. సభా ప్రాంగణం నిండిపోవడంతో కొంత మందిని అనుమతించలేదు. పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

జనంమెచ్చిన నాయకుడి కోసం..

ఖలీల్‌వాడి: తమ ప్రియతమ నేత ప్రధాని నరేంద్ర మోదీ ఇందూరులో నిర్వహించిన జనగర్జన సభను వీక్షించేందుకు జిల్లా నుంచే కాకుండా ఉత్తర తెలంగాణ పసుపు రైతులు సైతం అధిక సంఖ్యలో హాజరయ్యారు. నగరంలోని జీజీ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన సభా ప్రాంగణం నిండిపోవడంతో రోడ్డుపైనే కూర్చొని మోదీ సభను వీక్షించారు. బీజేపీ నాయకుల అంచనా కంటే జనం అధిక సంఖ్యలో హాజరు కావడంతో సభా ప్రాంగణంతో పాటు చుట్టు పక్కల ప్రాంతాలు జనంతో నిండిపోయాయి. ఉత్తర తెలంగాణలోని జగిత్యాల, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన పసుపు రైతులు ఎక్కువ సంఖ్యలో హాజరయ్యారు. ఈనెల 1న మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన బీజేపీ సభలో మోదీ పసుపు బోర్డును ఏర్పాటు చేస్తామని ప్రకటించడంతో రైతులు ఇందూరు జనగర్జన సభకు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. కంఠేశ్వర్ బైపాస్ నుంచి జీజీ కళాశాల వరకు ప్రజలతో నిండిపోయింది. కొంత మంది యువకులు, రైతులు మోదీని చూసేందుకు భారీ కటౌట్లు, చెట్లు ఎక్కారు. సభా ప్రాంగణం బయటే సుమారు 40 వేల మంది ఉన్నట్లు బీజేపీ నాయకులు తెలిపారు.




అవినీతి లేని పాలనకు మోదీ కృషి



నిజామాబాద్ సిటీ: దేశంలో అవినీతి లేని పాలనకు దేశ ప్రధాని నరేంద్రమోదీ కృషి చేస్తున్నారు. ప్రపంచాన్ని తన గుప్పిట్లో పెట్టుకుని దేశాన్ని పాలిస్తున్న విధానం మూడోసారి మోదీని ప్రజలు ప్రధానిగా చూడాలనుకుంటున్నారు. పసుపు బోర్డు తీసుకొస్తానని ఎంపీ అరి్వంద్ హామీ ఇచ్చి సాధించారు. అంతేకాకుండా గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుతో వారికి ఎంతో మేలు కలుగుతుంది. మోదీ దేశంలో జాతీయ రహదారుల అభివృద్ధి, రైల్వేస్టేషన్లను విమానాశ్రయం లాగా అభివృద్ధి చేస్తున్నారు.

– బస్వా లక్ష్మీనర్సయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

భరతమాత వేషధారణలో చిన్నారి



నిజామాబాద్ సిటీ/నిజామాబాద్‌నాగారాం: నగరంలోని జీజీ కళాశాల మైదానంలో ప్రధాని నరేంద్ర మోదీ ఇందూరు జనగర్జన సభ నిర్వహించారు. ఈ సభలో సుభాష్‌నగర్‌కు చెందిన చిన్నారి హితన్ శ్రీ భరత మాత వేషధారణలో వచ్చింది. చిన్నారి వేషధారణ సభికులను ప్రత్యేకంగా ఆకర్షించడతో పలువురు ఆ చిన్నారితో సెల్ఫీ దిగారు. చిన్నారికి ప్రధాని నరేంద్రమోదీ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. బాలల సంరక్షణ అధికారి చైతన్యకుమార్ కూతురు అయిన హితన్ శ్రీ సుభాష్‌నగర్‌లోని గిర్వాణి పాఠశాలలో యూకేజీ చదువుతోంది.

ప్రధాని మోదీకి ధన్‌పాల్ స్వాగతం



సుభాష్‌నగర్: ఇందూరు జనగర్జన సభకు హాజరైన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి బీజేపీ నేత ధన్‌పాల్ సూర్యనారాయణ మంగళవారం హెలీప్యాడ్ వద్ద స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ బహిరంగ సభకు అర్బన్ నియోజకవర్గం నుంచి పెద్దసంఖ్యలో తరలివచ్చిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రజల ఆశీర్వాదంతో బీజేపీ వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు.

జనగర్జన సైడ్‌లైట్స్



- ఇందూరు జనగర్జన సభలో పాల్గొనేందుకు ఉదయం 10.00గంటల నుంచి ప్రజలు తరలివచ్చారు.
- మధ్యాహ్నం 12గంటల వరకు సభాప్రాంగణం నిండిపోయింది.
- 2 గంటల నుంచి సభాప్రాంగణానికి జనం ర్యాలీగా వస్తూనే ఉన్నారు.
- సభాప్రాంగణంలో స్థలం లేకపోవడంతో కొందరు వెనుదిరిగారు.
- 2.56నిమిషాలకు గవర్నర్ తమిళిసై నూతన కలెక్టరేట్‌కు చేరుకున్నారు.
- 3గంటలకు బీజేపీ అగ్రనేతలు ఈటల, డీకే అరుణ, మురళీధర్‌రావు తదితరులు వచ్చారు.
- 4.04 నిమిషాలకు కేంద్రహోంమంత్రి కిషన్ రెడ్డి, గవర్నర్ తమిళిసై, రాష్ట్ర మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అధికారులు మోదీకి స్వాగతం పలికారు.
- వర్చువల్ ఫొటోగ్యాలరీని మోదీ 4.12 నిమిషాలకు పరిశీలించారు.
- వర్చువల్‌గా అభివృద్ధి పనులను ప్రారంభించిన మోదీ.. 8నిమిషాలపాటు ప్రసంగించారు.

– నిజామాబాద్‌అర్బన్/నిజామాబాద్ నాగారం


సమీకృత కలెక్టరేట్ వద్ద గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

బండి సంజయ్‌కి తగ్గని క్రేజ్



సుభాష్‌నగర్: ఇందూరు జనగర్జన సభ ముగిసిన అనంతరం కరీంనగర్ వెళ్తున్న బండి సంజయ్‌కు దారి పొడవునా కార్యకర్తలు నీరాజనం పలికారు. సంజయ్ వాహనాన్ని చుట్టుముట్టి హిందూ టైగర్ బండి సంజయ్.. జై బీజేపీ అంటూ నినాదాలు చేశారు. ఆయనతో సెల్ఫీలు దిగేందుకు కార్యకర్తలు ఎగబడ్డారు. దీంతో కంఠేశ్వర్ బైపాస్ ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. పోలీసులు జోక్యం చేసుకుని ఆయన వాహనానికి దారి చూపడంతో కార్యకర్తలకు అభివాదం చేసుకుంటూ వెళ్లిపోయారు. కాగా బహిరంగ సభ వేదికపైకి ఆహ్వానించే సమయంలోనూ బండి సంజయ్ పేరు పలకగానే ప్రజలు ఈలలు, కేకలు వేశారు.

క్లుప్తంగా

ముదిరాజ్‌ల రిజర్వేషన్లపై సీఎంతో చర్చిస్తా

- స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి

బాన్సువాడ : ముదిరాజ్ కులస్తులను బీసీ–డి నుంచి బీసీ–ఏలోకి మార్చేందుకు సీఎం కేసీఆర్‌తో చర్చిస్తానని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని పాత బాన్సువాడలో ముదిరాజ్‌ల ఆరాధ్య దేవత పెద్దమ్మ తల్లి ఆలయానికి భూమి పూజ చేశారు. అనంతరం పాత బాన్సువాడలో రూ.65 లక్షలతో నిర్మించిన ముదిరాజ్ సంఘం కల్యాణ మండపంతో పాటు పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాన్సువాడలో ముదిరాజ్ కులస్తులకు 200 డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇచ్చామని తెలిపారు. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి నివాసం నుంచి ముదిరాజ్ కులస్తులు భారీ ర్యాలీ నిర్వహించారు. మహిళల కోలాటం, కళాకారుల నృత్యాలు అలరించాయి. జెడ్పీటీసీ పద్మ, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు బట్టు విఠల్, ముదిరాజ్ సంఘం ప్రతినిధులు ఉన్నారు.

రోడ్లకు రూ.69.25 కోట్లు మంజూరు

బాన్సువాడ : బాన్సువాడ నియోజకవర్గంలో ఆర్‌అండ్‌బీ రోడ్ల విస్తరణ, మరమ్మతుల కోసం రూ.69.25 కోట్లు మంజురైనట్లు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. రోడ్లు, భవనాల శాఖ ద్వారా మంగళవారం నిధులు మంజురయ్యాయని అన్నారు. నిధులను విడుదల చేసిన సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ప్రాధాన్యత పాయింట్లపై అభ్యంతరాల స్వీకరణ

కామారెడ్డి టౌన్: జిల్లాలో సెకండరీ గ్రేడ్ టీచర్ల(ఎస్‌జీటీ) బదిలీలలో దరఖాస్తుదారులు సమర్పించిన ప్రాధాన్యత పాయింట్లపై అభ్యంతరాలుంటే తెలపాలని డీఈవో రాజు సూచించారు. ఈ విషయమై ఆయన మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. బుధవారం సాయంత్రంలోగా డీఈవో కార్యాలయంలో అభ్యంతరాలకు సంబంధించిన దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు. ఈనెల 5వ తేదీన తుది జాబితా ప్రకటిస్తామని, 6, 7వ తేదీలలో వెబ్ ఆప్షన్‌లు, 8వ తేదీన ఎడిట్ ఆప్షన్‌లకు అవకాశం ఉంటుందని తెలిపారు.

పంపిణీకి బతుకమ్మ చీరలు సిద్ధం

బిచ్కుంద(జుక్కల్): మండలంలో బతుకమ్మ చీరలు మహిళలకు పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉన్నాయని తహసీల్దార్ లక్ష్మణ్ అన్నారు. మంగళవారం రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి బతుకమ్మ చీరలు కార్యాలయానికి వచ్చాయని, డీలర్లు లబ్ధిదారులకు పంపిణీ చేయాలని సూచించారు. 17,275 చీరలు రావాల్సి ఉండగా 8,250 చీరలు వచ్చాయని, లబ్ధిదారులు బతుకమ్మ చీరలను తీసుకెళ్లాలని కోరారు.

నేడు హైదరాబాద్‌లో ఈసీ మీటింగ్

సాక్షి, కామారెడ్డి: అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ కోసం కేంద్ర ఎన్నికల సంఘం అధికారుల బృందం కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా బుధ, గురువారాల్లో హైదరాబాద్‌లో కలెక్టర్లు, ఎస్పీలతో సమీక్ష నిర్వహించనుంది. ఈ సమావేశంలో జిల్లానుంచి కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొననున్నారు. పోలింగ్ కేంద్రాలు, సిబ్బంది, అధికారులు ఇతర ఏర్పాట్లకు సంబంధించిన పూర్తి సమాచారంతో సమావేశంలో పాల్గొననున్నారు.

నేడు యోగా భవన్ ప్రారంభం

కామారెడ్డి అర్బన్: కలెక్టరేట్ సమీపంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ప్రభు త్వ నిధులు, యోగా అభిమానుల విరాళాలతో నిర్మించిన యోగా భవన్ ప్రారంభోత్సవానికి సిద్ధమయ్యింది. దీనిని బుధవారం ఉదయం 10 గంటలకు ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ప్రారంభిస్తారని యోగా, స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గడ్డం రాంరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపా రు. జిల్లాలోని యోగా అసోయేషన్ ప్రతినిధులు, యోగా అభిమానులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నెరవేరిన మూడు దశాబ్దాల కల



మూడు దశాబ్దాల కల పసుపు బోర్డు నెరవేరింది. దీని వెనుక ఎంపీ అర్వింద్ కృషి ఎంతో ఉంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పసుపుబోర్డు ఏర్పాటుపై కీలక పాత్ర పోషించారు. గతంలో ఎంపీ, ఎమ్మెల్యేగా పనిచేసిన వారు పసుపుబోర్డుపై రైతులను మభ్యపెట్టారు. ప్రధాని మోదీ జాతీయ రహదారులను అభివృద్ధి చేయడంతో ప్రయాణాలు సులభంగా మారాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేశారే తప్పా అభివృద్ధి చేయలేదు. ప్రజలు మరోసారి బీఆర్‌ఎస్‌ను నమ్మి మోసపోవద్దు. – పల్లె గంగారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి

మనసున్న మహనీయుడు మోదీ



రైతులకు పసుపుబోర్డు, సబ్సిడీపై ఎరువులు అందిస్తున్న ప్రధాని నరేంద్రమోదీ రైతుల గుండెలో నిలిచిన మహనీయుడు. వానాకాలంలో రైతులు పండించిన వడ్లకు క్వింటాలుకు రూ. 2203 మద్దతు ధర ప్రకటించి ఆదుకున్నారు. కరోనా సమయంలో 10 కిలోల బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేసి ఆదుకున్నారు. ఏ సర్వేలో చూసినా 75 శాతం మోదీ ప్రపంచ నేత అని తేలింది. – యెండల లక్ష్మీనారాయణ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు




పోలీసులతో బీజేపీ నాయకుల వాగ్వాదం


మైదానంలో స్థలం లేక రోడ్డు బయట కూర్చున్న మహిళలు


పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో పార్క్ చేసిన బస్సులు

క్రైం కార్నర్

బడాపహాడ్‌లో మెదక్‌వాసి మృతి



వర్ని: బడాపహాడ్‌లో మొక్కులు చెల్లించేందుకు వచ్చిన ఒకరు విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు ఎస్సై కృష్ణకుమార్ తెలిపారు. మెదక్ జిల్లా శంకరంపేట్‌కు చెందిన అవదగిరి పోచయ్య(36) బడాపహాడ్ పుణ్యక్షేత్రంలో మొక్కులు తీర్చుకునేందుకు మంగళవారం వచ్చాడు. అద్దెకు తీసుకున్న రూములో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కడుపునొప్పితో ఒకరి ఆత్మహత్య



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని చందాపూర్‌కు చెందిన అల్లూరి నర్సారెడ్డి (35)కడుపునొప్పి భరించలేక ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఆంజనేయులు మంగళవారం తెలిపారు. ఆసుపత్రుల్లో చూయించినా నయం కాకపోవడంతో తన వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య సౌజన్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సీఎం కేసీఆర్ హామీలిస్తే నమ్మకండి

- ఎన్నికల నోటిఫికేషన్ రాగానే ఆయన ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా మారతారు
- గజ్వేల్‌లో చేసిన అభివృద్ధి శూన్యం
- మాయమాటలతో కామారెడ్డికి..
- మాజీ మంత్రి షబ్బీర్‌అలీ విమర్శలు


దోమకొండలో అంగన్‌వాడీల సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి షబ్బీర్‌అలీ

దోమకొండ/కామారెడ్డి టౌన్: ఎన్నికల నోటిఫికేషన్ ఈ నెల 8న రాబోతుందని, నోటిఫికేషన్ రాగానే ప్రస్తుత సీఎం కేసీఆర్ ఆపద్ధర్మ సీఎంగా కొనసాగుతారని మాజీ మంత్రి షబ్బీర్‌అలీ అన్నారు. మంగళవారం దోమకొండ మండల కేంద్రంలో అంగన్‌వాడీలు, ఆశావర్కర్‌ల సమ్మెకు, జిల్లా కేంద్రంలో ఆశా కార్యకర్తలు, ఈ –పంచాయతీ ఆపరేటర్ల సమ్మెకు ఆయన సంఘీభావం తెలియజేసి మాట్లాడారు. సీఎం కేసీఆర్ గజ్వేల్ నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి చేయలేదని విమర్శించారు. తాను కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి గజ్వేల్‌తో పాటు సీఎం దత్తత గ్రామం వాసాలమర్రిలో పర్యటించానని చెప్పారు. కేసీఆర్ కుటుంబం రూ.వేల కోట్లు దోచుకున్నారని, అసైన్‌మెంట్ భూములను కొల్లగొడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికే సీఎం కేసీఆర్ కూతురు కవిత కామారెడ్డి ప్రాంతంలో పెద్ద ఎత్తున భూములను కొన్నారని, లిక్కర్ స్కాంలో కవిత రూ.వేల కోట్లు సంపాదించారన్నారు. కేసీఆర్‌ను ఓడిస్తేనే పేదలకు భూములకు మిగులుతాయన్నారు. బీఆర్‌ఎస్ నాయకులకే దళితబంధు, బీసీబంధు ఇస్తున్నారని ఆరోపించారు. అనంతరం అన్నదానం చేశారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్రబోయిన స్వామి, కార్యదర్శి తాటిపల్లి శ్రీకాంత్, దోమకొండ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలిన మున్సిపల్ కార్మికులు



బాన్సువాడ రూరల్: హక్కుల సాధన కోసం హైదరాబాద్‌కు మంగళవారం బాన్సువాడ నుంచి కార్మికులు ప్రత్యేక వాహనాల్లో తరలి వెళ్లారు. రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 25న సమ్మె నోటీసు ఇచ్చారని, ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు రవీందర్ కోరారు. లేదంటే ఈ నెల 8 నుంచి కార్మికులంతా సమ్మెబాట పట్టనున్నారని ఆయన తెలిపారు. మున్సిపల్ కార్మికుల సంఘం బాన్సువాడ కార్యదర్శి రాజు, రాజేష్, దొబ్బల సాయిలు, తదితరులు పాల్గొన్నారు.